# అమ్మ

బాబ్జీ మద్రాసు పనిపుండి వెళ్తుంటే అతని మూడేళ్ళ కొడుకు 'నేనూ వస్తా'నని ఏడ్చాడు. అతని భార్య, "వాణ్ణి తీసుకువెళ్ళండి. చెన్నపట్టణం చూస్తాడు" అన్నది. అతనికైతే యేమాత్రం తీసుకువెళ్దామనీ లేదు. కాని ఒక ప్రక్క వాడి ఏడుపూ, రెండో ప్రక్క భార్య సలహాతో అతనికి అంగీకరించక తప్పలేదు.

మద్రాసు వెళ్ళేబండి అతని వూరికి రాత్రి తొమ్మిది గంటలకు వస్తుంది. అతను పిల్లవాడికి భోజనం పెట్టించి, తాను భోజనంచేసి, ప్రయాణ సౌకర్యం కోసం వీలైనంత తక్కువ సామాను తీసుకొని యెనిమిది గంటలకల్లా స్టేషనుకి చేరాడు. ఆరోజు బండి ఒకగంట ఆలస్యంగా చేరింది.... ఈలోగా పిల్లవాడు మారాం మొదలుపెట్టాడు. కనుపించినవన్నీ కొనిపెట్టమన్నాడు. అప్పుడు భోజనంచేసివచ్చి అమ్మేవాణ్ణి చూచి 'పెరుగు సాదం' పొట్లం కొనిపెట్టమన్నాడు. ఎంత చెప్పినా కొనేవరకూ వినలేదు. కొన్న తర్వాత 'నాకు అక్కర్లేదు' అన్నాడు. పారేసేవరకూ వినలేదు. చివరకు ఎలాగైతేనేం, రైలు వచ్చింది. బాబ్జీ పిల్లవాణ్ణి తీసుకొనిరెండో తరగతి పెట్టెలోకి యెక్కాడు క్రింద ఒక సీటు ఖాళీగావుంది. పైన ఒక బర్త్ ఖాళీగావుంది. పైబర్త్‌మీద ప్రక్క పరచి, క్రింద ఖాళీగావున్న సీటులో కొడుకుని పెట్టుకు కూర్చున్నాడు బాబ్జి.

రైలు నాలుగయిదు స్టేషనులు దాటింది. పెట్టెలో వాళ్ళందరూ జోగుతున్నారు. పిల్లవాడి కళ్ళు మూతలుపడుతున్నై. బండి తెల్లవారి ఎప్పుడో జేరుకుంటుంది మద్రాసు. పిల్లవాణ్ణి క్రిందసీట్లో పడుకోబెట్టి తాను పైబర్త్ మీద పడుకుందాం అనుకొని లేచి తాము కూర్చున్న ఖాళీలో దుప్పటి పరిచాడు, బాబ్జీ "పడుకో బాబూ!" అన్నాడు. నిద్ర అసలే కళ్ళమీదకు వచ్చివుందేమో, పడుకోబెట్టి పెట్టకముందే నిద్రపోయాడు పిల్లవాడు బాబ్జీ తాను పరచివున్న పైబర్త్ ఎక్కి పడుకున్నాడు.

* * *

ఒక రాత్రివేళ అతనికి అకస్మాత్తుగా మెళకువ వచ్చింది. ఎవ్వరో క్రిందనుంచి తన చొక్కాలాగుతున్నట్టు అనిపించింది. బరువుకళ్ళతో తొంగి చూశాడు. క్రిందసీటులో కూర్చునివున్న పెద్దమనిషి తన కొడుకు పడుకొనివున్న సీటువైపుకి చూపాడు. బాబ్జీ చూశాడు. ఆ సీటులో కొడుకు పడుకొనిలేడు. పక్కమధ్య కూర్చొని కుళ్ళి కుళ్ళి యేడుస్తున్నాడు.

బాబ్జీ కళ్ళు నలుపుకొని క్రిందకుదిగి పిల్లవాడి ప్రక్కకు జేరాడు.

“ఎందుకు ఏడుస్తున్నావ్?” అన్నాడు.

కొడుకు ఏడ్పు మానలేదు.

“నేను యిక్కడే వున్నాగా!” అన్నాడు.

కొడుకు ఏడుపు బిగబట్టటానికి ప్రయత్నించాడు.

“పడుకో. మా నాన్నకదూ” అని వాణ్ణి పడుకోబెట్టటానికి ప్రయత్నించాడు బాబ్జి.

వాడు కళ్ళు తుడుచుకుంటూ, “అమ్మకూలా నా దగ్గలే పలుకునేది” అన్నాడు.అమ్మకూలా నాదగ్గరే పడుకునేదట. తను తన ప్రక్కనే పడుకోవాలని వాడి ఉద్దేశం. వాడుతన ఉద్దేశాన్ని బయటపెట్టినరీతికి, బాబ్జీకి నవ్వు వొచ్చింది.

“సరే నేనూ నీదగ్గరే పడుకుంటాను, పడుకో” అన్నాడు.

కొడుకు పడుకున్నాడు. వాడి ప్రక్కనే పడుకున్నాడు బాబ్జి. రైలు చీకటిని చీల్చుకొని వెళ్తూవుంది. పెట్టెలోవాళ్ళు ఎక్కడివాళ్ళు అక్కడే కునికిపాట్లు పడుతున్నారు. బాబ్జీకి కొడుకు ప్రక్కన పడుకోవటానికి చోటు చాల్లేదు. అయినా ఎక్కడ కదిలితే ఎక్కడ వాడు నిద్రపోడో అనే భయం కొద్దీ బిగపట్టుకొని అలాగే పడుకున్నాడు.

వొక స్టేషన్ వచ్చింది. పోయింది. ఇక పరవాలేదు అనుకున్నాడు.

బాబ్జి. కొడుకు నిద్రపోయాడు అనుకున్నాడు. మనస్సులో యిక ఎప్పుడూ వాడితో యిటువంటి సంబంధం పెట్టుకోగూడదని నిశ్చయించుకున్నాడు. కాని యింతలో కొడుకు గాలి ఎగపీలుస్తున్నట్టు అనుమానం వచ్చింది బాబ్జీకి. ప్రక్కకు తిరిగి చూశాడు. కొడుకు నిద్రపోలేదు. వాడిలో వాడే ఎక్కెక్కి ఏడుస్తున్నాడు.

"ఏం బాబూ?"

వాడు పలకలేదు.

"నిద్ర పట్టటంలా?"

వాడు ఏడుపు మానలేదు.

బాబ్జీకి విసుగుపుట్టింది. "పడుకో" అని కసురుకున్నాడు.

వాడు ఏడుపు ఎక్కువ చేశాడు. పెట్టెలో ప్రయాణీకులు యెక్కడ లేని నిద్రాభంగం అయినందుకు చీదరించుకుంటారో అని భయం వేసింది అతనికి.

"ఊరుకో బాబూ, ఊరుకో" అని కొడుకుని బ్రతిమాలాడు. వాడు కొంచం నెమ్మదించిం తర్వాత.... "ఏం బాబూ, నిద్రరావటంలా?" అని అడిగాడు.

"వత్తావుంది."

"వస్తే మరి పడుకో" అన్నాడు.

"అమ్మా...." మొదలు పెట్టాడు పిల్లవాడు.

"ఆ! అమ్మ!" అడిగాడు బాబ్జి.

"నన్ను పలుకోబెట్టి జోకొట్టి, జోలపాలేది...." అన్నాడు. అమ్మ తన్ను పడుకోబెట్టి జోల పాడేదట! ఇవన్నీ తన్ను చెయ్యమంటాడు వాడు.

పడుకోబెట్టవచ్చు, జోకొట్టనూవచ్చు. కాని జోలపాడేది ఎట్లా! బాబ్జికి కోపం యెక్కువ అయింది.ఇంతలో కొడుకు ఏడుపు ఎక్కువ చేశాడు.

"పడుకోబాబూ, పడుకో" అన్నాడు బాబ్జి. పడుకో బెట్టాడు. తాను పక్కన పడుకున్నాడు. జోకొట్టాడు. కాని కొడుకు ఏడుపు మానలేదు. జోలపాడటం ఒకటి మిగిలివుందని బాబ్జి గమనలో వుంది. కాని యెలా జోలపాడటం? తన భార్య పాడుతుండగా విన్నాడుగాని.... వెంటనే తాను మేలుకొని వుంటే తన భార్య సాకేసాకులు ఇంకేమీ సాకమంటాడో అని భయంవేసింది బాబ్జికి. వాణ్ని నిద్రపుచ్చటం తన ప్రథమ కర్తవ్యం అనుకున్నాడు. వొకసారి పెట్టె కలయజూశాడు. అంతా నిద్రపోతున్నారు. తన్ను నిద్రనుంచి లేపిన పెద్దమనిషి కూడా కునుకుతున్నాడు. నెమ్మదిగా కూనిరాగంలో మొదలు పెట్టాడు బాబ్జి.

"జో అచ్యుతానంద జోజో ముకుందా!

రార పరమానంద రామ గోవిందా!

జో, జో .... .... ...."

)o....o(